
ప్రజాశక్తి

బుధవారం 8 నవంబర్ 2023



తలవరం పాఠశాలకు బంగారు పతకం

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని తలవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న భువన కృతికి బంగారు పతకం లభించినట్లు ప్రధాన ఉపాధ్యాయులు ఉప్పాడ అప్పారావు మంగళవారం తెలిపారు. నెల్లూరులో జరిగిన రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మెంట్ పోటీల్లో అండర్- 14 విభాగంలో ప్రథమ స్థానంలో గెలుపొందడంతో భువనకృతికి బంగారు పతకం లభించడంతో సర్పంచ్ సిహెచ్ మధుసూదన్‌రావు, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు అభినందనలు తెలిపారు.




రైతు భరోసా నిధులు విడుదల

- 145954 మంది రైతులకు లబ్ధి
- పెద్ద ఎత్తున రైతు కార్యక్రమాలు : జెడ్‌పి చైర్మన్

ప్రజాశక్తి - పార్వతీపురం

రైతు భరోసా - పి.ఎం.కిసాన్ పదో సంవత్సరంలో రెండవ విడత జిల్లాలో 1,45,954మంది రైతులకు రూ.59.72కోట్లు నిధులు మంజూరయ్యాయి. వీటిలో 123599 మంది రైతులకు రూ.50.646 కోట్లు, 18803 మంది ఆర్‌ఒఎఫ్‌ఆర్ రైతులకు రూ.7.567 కోట్లు, 3552 మంది కౌలు రైతులకు రూ.1.507 కోట్లు రైతుల అకౌంట్‌లో జమయ్యాయి. ఈ మేరకు ఈ నిధుల పంపిణీ కార్యక్రమం కలెక్టరేట్‌లో మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున రైతు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోందన్నారు. ఇందులో భాగంగా రైతు భరోసా - పిఎం కిసాన్ పథకం కింద రైతులకు ఆర్థిక దన్నుగా నిలుస్తుందన్నారు. ఈ ఏడాది వర్షాభావ పరిస్థితుల వల్ల జిల్లాలో దాదాపు 2,500 ఎకరాల్లో పంట ఎండిపోయిన పరిస్థితి కనిపిస్తుందని, దీని పట్ల రైతాంగం అధైర్యపడవద్దని సూచించారు. రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందని ఆయన చెప్పారు. రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం అనేక కార్యక్రమాలను అమలు చేస్తోందని ఆయన పేర్కొన్నారు. జిల్లాలో చెరకు పంటను ప్యారిస్ సంస్థతో అనుసంధానం చేశామన్నారు. కలెక్టర్ నిశాంత్ కుమార్ మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రాలు వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టిందన్నారు. వన్ స్టాప్ కేంద్రంగా, ఉత్తమ పని విధానంలో ప్రత్యేకత సంతరించుకుందన్నారు. యంత్ర సేవా కార్యక్రమం ద్వారా రైతులు అద్దె ప్రాతిపదికన ఆధునిక వ్యవసాయ పనిముట్లు సద్వినియోగం చేసుకోవచ్చని తెలిపారు. గత ఏడాది కనిపించిన లోటుపాట్లు సరిచేస్తూ ఈ ఏడాది పక్కాగా విజవంతంగా ధాన్యం కొనుగోలు చేసేందుకు చర్యలు చేపట్టామన్నారు. ప్రతి ధాన్యం గింజ కొనుగోలు చేసి రైతులను ఆదుకునేందుకు జిల్లాకు లక్ష్యాలు నిర్దేశించవద్దని ప్రభుత్వాన్ని కోరామని తెలిపారు. జిల్లాలో 98 శాతం ఇ క్రాప్, ఇకెవైసి జరిగిందని, రాష్ట్ర వ్యాప్తంగా మొదటి ఐదు స్థానాల్లో జిల్లా ఉందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే ఎ.జోగారావు, ఎంపిపి మజ్జి శోభారాణి, జిల్లా వ్యవసాయ అధికారి కె రాబర్ట్ పాల్, టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్న కుమార్, వైసిపి జిల్లా అధ్యక్షులు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు, వైసిపి నాయకులు శోభా హైమావతి, లబ్ధిదారులు పాల్గొన్నారు.



రైతు భరోసా చెక్కును అందజేస్తున్న జెడ్‌పి చైర్మన్ శ్రీనివాసరావు, కలెక్టర్ నిశాంత్‌కుమార్

16న సహాయ ఉపకరణాల గుర్తింపు శిబిరం

సీతంపేట: హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ కృత్రిమ అవయవాల తయారీ కేంద్రం (ఆలీమ్ కో) వారు ఈనెల 16న భామిని మండల పరిషత్ కార్యాలయంలో వికలాంగులు, వయోవృద్ధులకు సహాయ ఉపకరణాల గుర్తింపు శిబిరం నిర్వహించనున్నట్లు ఐటిడిఎ పిఒ కల్పన కుమారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. శారీరక వైకల్యం గలవారికి బ్యాటరీ ట్రై సైకిళ్లు, 3 వీలర్ సైకిళ్లు, వీల్ చైర్లు, కృత్రిమ కాళ్లు, చంక కర్రలు, క్యాలిపర్స్, దృష్టి లోపం ఉన్నవారికి స్మార్ట్ చేతికర్ర, బ్రెయిలీ కిట్, స్మార్ట్ ఫోన్, చెవుడు ఉన్నవారికి వినికిడి యంత్రం, వయోవృద్ధులకు చేతి కర్రలు, వాకర్లు, మూడు కాళ్ళ చేతి కర్రలు, వీల్ చైర్లు, వినికిడి యంత్రాలు అందజేస్తామన్నారు. ఈ శిబిరానికి వచ్చేవారు తమ వెంట వైద్యశాఖ జారీ చేసిన సదరం సర్టిఫికెట్, రేషన్, ఓటరు, ఆధార్ కార్డ్, 2 ఫోటోలుతీసురావాలని సూచించారు. 60ఏళ్లు దాటిన వయోవృద్ధులకు సదరం సరిఫికెట్ అవసరం లేదన్నారు. అర్హులు ఈనెల 16న ఉదయం 10 గంటలకు భామిని ఎంపిడివో కార్యాలయంలో నిర్వహించే గుర్తింపు శిబిరానికి హాజరై తమ పేర్లను నమోదు చేసుకోవాలని పీవో కోరారు.



చెట్లు తొలగింపునకు ముందు పచ్చగా ఉన్న మెయిన్‌రోడ్డు



చెట్లు తొలగింపుతో బోసిపోయిన మెయిన్‌రోడ్డు

ఎవరి మెప్పుకోసం

రాత్రికి రాత్రే మొక్కలు తొలగింపు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

పచ్చదనం ప్రగతి మెట్లు... ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి అంటూ పాలకులు, అధికారులు ఒకవైపు ప్రసంగాలు గుప్పిస్తూ, పెద్దమొత్తంలో ప్రజాధనం ఖర్చు చేస్తుండగా... మరో వైపున ఉన్న మొక్కలు, చెట్లును నరికేస్తున్నారు. అధికారులు ఎందుకు ఇలా చేస్తున్నారో ఎవరికీ అంతుపట్టక తలలు పట్టుకుంటున్నారు. ఇలాంటి పరిస్థితే పట్టణంలో చోటు చేసుకుంది.

పట్టణ ప్రధాన రహదారి మధ్యలో గల డివైడర్‌పై ఉన్న మొక్కలను, చెట్లును సోమవారం నాడు రాత్రికి రాత్రే మున్సిపల్ అధికారులు సిబ్బందితో నరికి వేయడంతో ఎవరి మెప్పు కోసం ఈ పనులు చేపట్టారు, ఇంత అర్ధాంతంగా పచ్చని చెట్లు పై కత్తి వేటు వేయడం ఏమిటని రహదారికి వైపులా ఉన్న వ్యాపారులతో పాటు పట్టణ ప్రజల బహిరంగంగానే విమర్శలు గుప్పిస్తున్నారు. మొక్కలను పెంచి భావితరాల మనుగడ కొరకు ప్రాణవాయువును అందించాలని, దేశంలో ఉన్న అన్ని రాష్ట్రాలతో పాటు ప్రపంచమంతా ప్రచారం చేస్తుంది. ఏ గోడపై చూసిన ఇలాంటి ప్రచార రాతలు కనబడుతూనే ఉంటాయి. ప్రధాన రహదారి మధ్యలో డివైడర్‌పై ఉన్న పచ్చని మొక్కలను గత ప్రభుత్వ హయాంలో ఏర్పడిన మునిసిపల్ పాలకవర్గం అనుమతితో పట్టణ సుందరీకరణతో పాటు కాలుష్య నియంత్రణ కొరకు లక్షలాది రూపాయల నిధులను వెచ్చించి మున్సిపల్ అధికారులు మొక్కలు నాటించారు. అవి చెట్లుగా పెరిగాయి. వాటిని మళ్లీ మున్సిపల్ అధికారులే దగ్గర ఉండి నరికించి వేసి పచ్చనదనానికి తూట్లు పొడవడం గమనార్హం.

ప్రజారోగ్యానికి మంచిదికాదనే తొలగించాం : కమిషనర్

ఈ విషయమై ప్రజాశక్తి మున్సిపల్ కమిషనర్ జె.రామఅప్పలనాయుడును వివరణ కోరగా, డివైడర్ మధ్యలో ఉన్న మొక్కలు కొనోకార్పస్ వృక్ష జాతికి చెందినవని, వీటి ద్వారా వచ్చే గాలి, పువ్వులు, పుప్పొడి ప్రజల ఆరోగ్యానికి మంచివి కాదని, ఈ మొక్కలను గుజరాత్ ప్రభుత్వం నిషేధించిందని, డివైడర్‌పై ఉన్న వీటిని దశలవారీగా తొలగించి వాటి స్థానంలో ప్రజల ఆరోగ్యానికి ఉపయోగపడే మంచి మొక్కలను నాటి డివైడర్‌పై గ్రిల్స్ ఏర్పాటు చేస్తునట్టు తెలిపారు. ఇందుకు సాధారణ నిధులు నుంచి రూ.5 లక్షలు ఖర్చు చేసేందుకు పాలకవర్గం కౌన్సిల్ సభ్యుల ముందస్తు ఆమోదం కోరడం జరిగిందని, పనులను త్వరలో ప్రారంభిస్తామని తెలిపారు. ఎప్పటిలోగా ఈ పనులను అధికారులు ప్రారంభిస్తారో చూడాలి మరి.

మున్సిపల్ అధికారుల తీరుపై సర్వత్రా విమర్శలు

మొక్కలు తొలగించడం సరికాదు

పట్టణంలోని ప్రధాన రహదారి మధ్యలో ఉన్న డివైడర్‌పై ఏడేళ్ల క్రితం నాటిన మొక్కలు ఇప్పుడు తొలగించడం సరికాదని మాజీ ఎమ్మెల్సీ ద్వారపూడి జగదీష్, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ద్వారపురడ్డి శ్రీదేవి మున్సిపల్ కమిషనర్‌తో అన్నారు. జిల్లా కేంద్రంలో సోమవారం రాత్రి మొక్కలు తొలగించడంతో మంగళవారం నాడు టిడిపి ఎమ్మెల్సీ, మున్సిపల్ చైర్ పర్సన్, టిడిపి కౌన్సిల్ సభ్యులు నాయకులతో కలిసి డివైడర్ లో మొక్కలు తొలగించిన ప్రాంతాన్ని పరిశీలించి, అనంతరం మున్సిపల్ కార్యాలయానికి వెళ్లి కమిషనర్ జె.రామ అప్పలనాయుడును మొక్కలను అర్ధాంతరంగా ఎందుకు తొలగించారని ప్రశ్నించారు. కమిషనర్ మాట్లాడుతూ ఈ మొక్కల వల్ల ప్రజలు అనారోగ్య సమస్యలు గురయ్యే అవకాశం ఉందని, దీం దృష్టిలో ఉంచుకొని తొలగిస్తున్నట్టు తెలిపారు. ఈ మొక్కల స్థానంలో పర్యావరణానికి ఉపయోగపడే మొక్కలు నాటుతామన్నారు. కార్యక్రమంలో పట్టణ టిడిపి అధ్యక్షులు జి.రవికుమార్, కౌన్సిలర్ నారాయణరావు, మండల అధ్యక్షులు గొట్టాపు వెంకటనాయుడు, మాజీ కౌన్సిలర్ పాలకొండ మరియదాసు, తదితరులు పాల్గొన్నారు



దేవునిబంద ఆక్రమణలను పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు కృష్ణమూర్తి, వెంకటరమణ, సూరిబాబు

ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలి

సిపిఎం నాయకులు ఎం.కృష్ణమూర్తి

ప్రజాశక్తి -పార్వతీపురం టౌన్

పట్టణంలోని నాలుగో వార్డు పరిధిలో ఎస్ఎన్ఎం నగర్‌కు ఆనుకొని ఉన్న దేవునిబందను ఆక్రమించిన వ్యక్తిని శిక్షించి, రెవెన్యూ అధికారులపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని సిపిఎం సీనియర్ నాయకులు ఎం.కృష్ణమూర్తి డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఆయన సిపిఎం పట్టణ కమిటీ నాయకులు గొర్లి వెంకటరమణ, బంకురు సూరిబాబుతో కలిసి దేవునిబంద మధ్యలో ఆక్రమించి వేసిన వేసిన రోడ్డును పరిశీలించారు. అనంతరం కృష్ణమూర్తి మాట్లాడుతూ సర్వే నెంబరు 343లో 4 ఎకరాల 93 సెంట్లు విస్తీర్ణం ఉన్న ఈ బంద ఇప్పటికే కొంత భాగం ఆక్రమణలకు గురైందన్నారు. బంద మధ్య నుంచి ఒక వ్యక్తి తమ జిరాయితి భూమికి వెళ్లేందుకు రహదారి పనులు ప్రారంభించడానికి అధికారులు ఎలా అనుమతులు ఇచ్చారు? ఎందుకు ఇచ్చారని; ప్రభుత్వం లేఅవుట్ వేసి ఇళ్లు లేని పేద ప్రజలకు స్థలాలను ఇవ్వాలనుకుంటు న్నారా అని ప్రశ్నించారు. ఇప్పటికే పట్టణంలో దాదాపు అన్ని చెరువులు ఆక్రమణలకు గురయ్యా యని, ఈ దేవునిబందపై 2008లో పేదవారికి ఇళ్ల స్థలాలను ఇవ్వాలని సిపిఎం ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టామని తెలిపారు. స్థలాలను స్వాధీనం కూడా చేశామన్నారు. అప్పట్లో తహశీల్దార్‌గా ఉన్న సీతాపతి 311 మంది పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు పట్టాలు తయారు చేశారని, ఇంతలో కొంతమంది వ్యక్తులు కోర్టుకు వెళ్లడంతో ఆ ప్రక్రియ ఆగిపోయిందని అన్నారు. ఈ బందకు ఆయకట్టు కూడా లేదన్నారు. 311 మందిలో ఇప్పుడు కొందరికి ఇళ్లు వచ్చి ఉండవచ్చని, అలాంటి వారిని ఆ జాబితాలో తొలగించి మిగిలిన వారికి ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. బెలగాంలో ఉన్న చెరువు వీధిలో అధికారులు పట్టాలు ఇచ్చారని, ఇప్పుడు నిర్మాణాలు చేస్తుంటే ఇది చెరువు అని అడ్డుకుంటున్నారని వారికొక న్యాయం వీరికొక న్యాయమా అని ప్రశ్నించారు. బందమధ్యలో ఒక వ్యక్తి ఆక్రమణ చేసి రహదారి వేస్తుంటే రెవెన్యూ అధికారులు కళ్లు మూసుకు న్నారా, అవినీతికి పాల్పడుతున్నారా, లేక రాజకీయ ఒత్తిళ్లకు గురవుతున్నారా అని ప్రశ్నించారు. వెంటనే సంబంధిత వ్యక్తిని శిక్షించి, ఆ వ్యక్తికి అనుమతులు ఇచ్చిన సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని, బందకు నాలుగు వైపుల బౌండరీని ఏర్పాటు చేయాలని, లేనిచో భవిష్యత్ కార్యాచరణ చేపడతామని హెచ్చరించారు.

బాల్య వివాహాలు నిరోధించాలి

ప్రజాశక్తి - పార్వతీపురం

బాల్య వివాహాలు నిరోధించాలని కలెక్టర్ నిశాంత్ కుమార్ అన్నారు. బాల్య వివాహాల నిరోధక చట్టం జిల్లా స్థాయి సమావేశం కలెక్టర్ అధ్యక్షతన కలెక్టరేట్‌లో మంగళవారం జరిగింది. సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ బాల్య వివాహాలు ఎక్కడ జరుగుతున్నా గుర్తించాలి, వాటిని నిరోధించాలన్నారు. బాల్య వివాహాలు సామాజిక దురాచారంగా పరిగణిస్తామని, వాటి పట్ల అవగాహన అవసరమని అన్నారు. ఇందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. బాల్య వివాహాలు నిరోధానికి అందరూ అంకిత భావంతో పనిచేయాలని సూచించారు. గ్రామ స్థాయిలో మహిళా పోలీస్, సచివాలయ వ్యవస్థ, వాలంటరీ వ్యవస్థ ఉందని, గ్రామ స్థాయిలో జరిగే వివాహాల పూర్తి వివరాలు తెలుసుకోవచ్చని అన్నారు. జిల్లా బాలల రక్షణ అధికారి ఎ. సత్యనారాయణ మాట్లాడుతూ బాల్య వివాహాలు జరిపించిన, సహకరించిన, ప్రోత్సహించిన వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



బాల్య వివాహాల నిరోధంపై పోస్టర్‌ను విడుదల చేస్తున్న కలెక్టర్, ఎస్‌పి, ఇతర అధికారులు

మాదక ద్రవ్యాలపై నిఘా ఉంచాలి

మాదక ద్రవ్యాలపై నిఘా ఉంచాలని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ అన్నారు. మాదక ద్రవ్యాల నిరోధక జిల్లా స్థాయి సమావేశం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ మాదక ద్రవ్యాల రహిత జిల్లాగా ఉండాలని, అందుకు అన్ని వర్గాల తోడ్పాటును అందించాలన్నారు. అంతర్ రాష్ట్ర సరిహద్దుల గుండా ప్రవేశించకుండా గట్టి నిఘా ఉండాలని ఆయన స్పష్టం చేశారు. బస్సుల్లో రవాణా చేసే అవకాశం ఉందని, అటువంటి వాటిపై కండక్టర్ లకు తగిన అవగాహన కల్పించాలని సూచించారు. ఎస్‌పి విక్రాంత్ పాటిల్ మాట్లాడుతూ బస్సులు, రైళ్లలో రవాణా జరుగుతున్నట్లు సమాచారం అందుతుందన్నారు. ప్రయాణికుల బాగ్‌ల్లో అనుమానాస్పదంగా ఉంటే అటువంటి సమాచారం అందించాలని ప్రజా రవాణా అధికారులను సూచించారు. వివిధ ప్రాంతాల్లో విద్యార్థులకు సరఫరా చేసే అవకాశాలు ఉన్నాయని, కళాశాలల ప్రిన్సిపాల్ లు, విద్యార్థులకు మాదక ద్రవ్యాల అనర్థాలపై తరచూ అవగాహన కల్పించాలని సూచించారు. సమావేశంలో డిఆర్‌ఒ జె.వెంకట రావు, ఎఎస్‌పి ఒ.దిలీప్ కిరణ్, డిఎస్‌పి మురళీధర్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి బి. జగన్నాథ రావు, డిఎఫ్‌ఒ జిఎపి ప్రసూన, డిఆర్‌డిఎ పీడీ పి.కిరణ్ కుమార్, జిల్లా ఎస్‌సి, బిసి కార్పొరేషన్ ఇడిలు ఎం.డి.గయాజుద్దీన్, ఎస్.కష్ణ, డిటిఒ సి.మల్లిఖార్జునరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పోలమాంబ ఆలయ ఇఒగా నారాయణ

ప్రజాశక్తి - మక్కువ

శంబర పోలమాంబ అమ్మవారి దేవస్థానం కార్యనిర్వహణాధికారిగా వివి సూర్యనారాయణ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుత ఇఒ వి.రాధాకృష్ణ నుండి బాధ్యతలు తీసుకున్నారు. శ్రీకాకుళం జిల్లా టెక్కలి మండలం రాయవలసలోని ఎండల మల్లికార్జున స్వామి ఆలయ ఇఒగా పనిచేసి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఆలయకమిటీ సభ్యులు, సిబ్బంది సహాయ సహకారాలతో ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని ఇఒ సూర్యనారాయణ తెలిపారు





రికార్డులను పరిశీలిస్తున్న ఎస్‌పి విక్రాంత్‌పాటిల్

శాంతి భద్రతల పరిరక్షణే ధ్యేయం : ఎస్‌పి

ప్రజాశక్తి - బలిజిపేట

జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణే ధ్యేయమని ఎస్పీ విక్రాంత్ పాటిల్ అన్నారు. మంగళవారం ఆయన స్థానిక స్థానిక పోలీస్ స్టేషన్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన స్టేషన్ నిర్వాహణ, రికార్డులను పరిశీలించి ఎస్సై ప్రశాంత్ కుమార్ పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం విలేకరులతో ఆయన మాట్లాడుతూ తాను విధుల్లోకి చేరిన నాలుగు నెలల్లో క్రైమ్ శాతం 30 వరకు తగ్గించానని, అలాగే శాంతి భద్రతల విషయంలో ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న సమస్యాత్మక గ్రామాలపై దృష్టి పెట్టి శాంతి భద్రతలు చేపడుతున్నట్లు తెలిపారు. దిశా యాప్ డౌన్‌లోడ్‌లపై అవగాహన కల్పిస్తూ ఇంతవరకు సుమారు 6 వేల యాప్‌లను ఇన్‌స్టాల్ చేయించామని తెలిపారు. ఇందుకు సహకరించిన మహిళా పోలీసులను ఆయన అభినందించినట్లు తెలిపారు. రోడ్డు భద్రత, నిబంధనలను ప్రతి ఒక్కరూ తప్పక అనుసరించాలని, ఓపెన్ డ్రింకింగ్, డ్రంక్ అండ్ డ్రైవ్ లపై కేసులు నమోదు చేస్తున్నామని తెలిపారు. ట్రిపుల్ డ్రైవింగ్ విషయంలో క్షమించేది లేదని హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని సూచించారు. ప్రధాన రహదారి పక్కన నో పార్కింగ్ ప్రదేశాల్లో లారీలు నిలుపుదల నిర్మూలన చేస్తున్నామన్నారు. శాంతి భద్రతల విషయంలో పెట్రోలింగ్‌ను నిబంధనలను బట్టి నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని 20 పోలీస్ స్టేషన్ పరిధిలో సిబ్బంది కొరత ఉన్నప్పటికీ పైఅధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటామన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్ వర్షాకాలంలో ముంపునకు, శిథిలావస్థలో ఉందని తెలుసుకున్న ఆయన ప్రత్యేక దృష్టి పెట్టి స్టేషన్ విషయంలో కొత్త పోలీస్ స్టేషన్ నిర్మాణానికి సన్నాహాలు చేయడానికి ప్రయత్నిస్తున్నట్లు ఆయన తెలిపారు. దిశా, ఫోక్సో చట్టాలపై 16 నుంచి 18 ఏళ్లలోపు అమ్మాయిలకు పూర్తిస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఎన్నికలు ముందస్తు చర్యల్లో భాగంగా జిల్లాలో అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో సమస్యాత్మక గ్రామాల్లో బైండోవర్, ఇతర నిబంధనలతో ప్రశాంత వాతావరణాన్ని నెలకొల్పుతున్నట్టు తెలిపారు. దీపావళి నేపథ్యంలో నిబంధనలకు విరుద్ధంగా మందుగుండు సామాన్లు విక్రయించినా, నిల్వ ఉంచినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు, ఎస్‌పి వెంట ఎస్సై ప్రశాంత్ కుమార్, ఎఎస్‌ఐ పాణిగ్రహి, పలువురు కానిస్టేబుళ్లు ఉన్నారు.



పెదచెరువులో నిర్వహిస్తున్న పైడితల్లమ్మ తెప్పోత్సవం

ఘనంగా తెప్పోత్సవం

ప్రజాశక్తి -విజయనగరం టౌన్

ఉత్తరాంధ్రుల ఇలవేల్పు పైడితల్లి అమ్మవారి తెప్పోత్సవం మంగళవారం పెద్ద చెరువులో ఘనంగా జరిగింది. వేద పండితులు, ఆలయ పూజారి వెంకటరావు ఆధ్వర్యంలో వనం గుడి నుంచి అమ్మవారిని సున్నపు వీధి గుండా పెద్ద చెరువు వద్దకు ఊరేగింపుగా తీసుకొచ్చారు. అనంతరం అమ్మవారి విగ్రహాన్ని విద్యుత్ వెలుగులతో నిండిన తెప్పలో ఉంచి మూడు సార్లు అమ్మవారిని తూర్పుకు, పడమరకు చెరువులో ఊరేగించారు. ప్రజలంతా పెద్ద చెరువు గట్టు నుంచి తెప్పోత్సవాన్ని వీక్షించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ శ్రావణి, ఆర్‌డిఒ సూర్యకళ, పైడితల్లి అమ్మవారి దేవస్థానం ఎసి సుధారాణి, ఆలయ ఉద్యోగులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

గిరిజనుల పట్ల ఎంఇఒ అనుచిత వైఖరి

- ఉపాధ్యాయుడ్ని కొనసాగించాలని డిమాండ్
- పాఠశాల బహిష్కరణకు నిర్ణయం
- దిక్కున్న చోట చెప్పుకోమన్నారని ఆవేదన

ప్రజాశక్తి - సాలూరు

మండల విద్యాశాఖాధికారి రాజ్‌కుమార్‌కు సమస్యలు చెప్పడానికి వెళ్లిన గిరిజనుల పట్ల అనుచితంగా ప్రవర్తించిన తీరుపై గంగన్నదొరవలస గ్రామస్తులు భగ్గుమంటున్నారు. తమ పాఠశాలలో ఉన్న ముగ్గురు ఉపాధ్యాయుల్లో ఒకర్ని మరో పాఠశాలకు డెప్యుటేషన్ వేయడంతో పిల్లల చదువులు దెబ్బతింటున్నాయని చెప్పేందుకు ఆ గ్రామానికి చెందిన మహిళలు, పిల్లల తల్లిదండ్రులు రెండు రోజుల క్రితం ఎంఇఒ కార్యాలయానికి వెళ్లారు. వీరిపై ఎంఇఒ రాజ్ కుమార్ విరుచుకుపడ్డారు. మీ దిక్కున్న చోట చెప్పుకోండని గర్జించారని, ఎక్కువ మాట్లాడితే కేసు పెట్టిస్తానని బెదిరించినట్లు గ్రామస్తులు ఆవేదన చెందుతున్నారు. 42మంది విద్యార్థులున్న పాఠశాల నుంచి ఒక ఉపాధ్యాయుడ్ని మరో పాఠశాలకు డెప్యుటేషన్ వేయడం సరికాదన్నారు. దీని వల్ల తమ పిల్లల చదువులు దెబ్బతింటున్నాయని ఫిర్యాదు చేయడానికి వెళ్తే ఎంఇఒ అనుచితంగా మాట్లాడారని పరసన్న దొర, జ్యోతి, అరుణ ఆందోళన వ్యక్తం చేశారు. ఎంఇఒ వైఖరికి నిరసనగా బుధవారం నుంచి తమ పిల్లలను పాఠశాలకు పంపకూడదని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. గిరిజనులమైన తాము సమస్యలు చెప్పడానికి వెళ్తే తమ పైనే కేసులు పెట్టిస్తానని ఎంఇఒ రాజ్ కుమార్ బెదిరించడంపై వారు ఆగ్రహం తో రగిలిపోతున్నారు.

అసలు విషయం ఏమిటంటే

మండలంలోని గంగన్నదొర వలస ఎంపి ప్రాథమిక పాఠశాలలో కొద్ది నెలల క్రితం వరకు ముగ్గురు ఉపాధ్యాయులు పని చేసేవారు. అయితే అధికారపార్టీ నాయకుల ఒత్తిడికి తలొగ్గిన ఎంఇఒ రాజ్ కుమార్ ఇక్కడి నుండి ఒక ఉపాధ్యాయుడ్ని దండిగాం పాఠశాలకు డెప్యుటేషన్ వేశారు. అక్కడ పని చేస్తున్న ఉపాధ్యాయుడ్ని బాగువలస హైస్కూల్‌కు డెప్యుటేషన్ వేశారు. ఇదంతా ఓ అధికార పార్టీ నాయకుడి ఒత్తిడి మేరకు ఎంఇఒ చేశారు. అయితే ఇటీవల దండిగాం పాఠశాలలో మరో ఉపాధ్యాయుడు చేరారు. దీంతో తమ పాఠశాల ఉపాధ్యాయుడ్ని రప్పించాలని కోరడానికి గంగన్నదొరవలస గ్రామస్తులు ఎంఇఒ వద్దకు వెళ్లారు. అలా వెళ్లి అడగడమే నేరమన్నట్లు ఎంఇఒ వ్యవహార శైలి చూసి వారు విస్తుపోయారు. ఇటీవల కాలంలో మండలంలో ఉపాధ్యాయులను ఇష్టారాజ్యంగా డెప్యుటేషన్ల పేరుతో బదిలీలు చేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ వ్యవహారంలో ఆమ్యామ్యాలు దండిగా అందాయనే ప్రచారం జరుగుతోంది.



పాఠశాల ముందు నిరసన తెలుపుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు

ఏనుగుల తరలింపునకు శాశ్వత చర్యలు చేపట్టాలి : సిపిఎం

ప్రజాశక్తి - గరుగుబిల్లి

మండలంలోని గొట్టివలస, తులసిరామినాయుడువలస, దలైవలస, ఉద్దవోలులో ఏనుగులు ధ్వంసం చేసిన పంటలను సిపిఎం నాయకులు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనేక ఏళ్లుగా ఏనుగులు పాలకొండ, పార్వతీపురం, కురుపాం నియోజకవర్గాల పరిధిలోని వివిధ మండలాల్లో సంచరించి ప్రజలకు, వ్యవసాయ పంటలకు తీవ్ర నష్టం చేకూరుస్తున్నాయని, ఏనుగుల సమస్యకు శాశ్వత పరిష్కారం చేపట్టాలని ఇప్పటికే అనేక సార్లు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసినా అధికారులు చర్యలు చేపట్టలేదని విమర్శించారు. ఇప్పటికే 11మంది ప్రాణాలను హరించాయని, కోట్ల రూపాయల పంట నష్టం కలిగించాయని తెలిపారు. గత పది రోజులుగా మండలంలోని గొట్టివలస, దలైవలస, ఉద్దవోలు, తులసిరామినాయుడువలస తదితర గ్రామాల్లో ఏనుగులు పామాయిల్, అరటి, వరి పంటల ధ్వంసం చేశాయని, ఈ నష్టాన్ని రెవెన్యూ అధికారులు గుర్తించి నష్టపరిహారం చెల్లించేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఏనుగుల తరలింపులో ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం వహిస్తుందని ఇప్పటికైనా అధికారులు ఏనుగుల తరలింపునకు శాశ్వతమైన చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు బివి రమణ, కె.రవీంద్ర, బి.సింహాచలం ఉన్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

నేడు సామాజిక సాధికారత బస్సుయాత్ర

ప్రజాశక్తి - సాలూరు

సామాజిక సాధికారత బస్సు యాత్రలో భాగంగా బుధవారం పట్టణంలోని ప్రధాన రహదారిపై సభ నిర్వహణకు ఏర్పాట్లు చురుగ్గా జరుగుతున్నాయి. డిప్యూటీ సిఎం రాజన్నదొర నాయకత్వంలో జరుగనున్న సభకు భారీ ఎత్తున జనసమీకరణ చేయాలని నిర్ణయించారు. సుమారు 20వేల మంది పార్టీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు హాజరవుతారని ఏర్పాట్లు చేశారు. నాలుగు మండలాల్లో గ్రామాల నుంచి ఆటోలు, ట్రాక్టర్లలో జనాలను తరలించేందుకు చర్యలు చేపట్టారు. పట్టణంలోని ఆరెంజ్టి వారి పెట్రోల్ బంకు ఎదురుగా రోడ్పై స్టేజ్ ఏర్పాటుకు నిర్ణయించారు. 2019లో సిఎం జగన్ మోహన్‌రెడ్డి పాదయాత్ర సందర్భంగా జరిగిన సభ ఇదే ప్రదేశంలో నిర్వహించారు. ప్రధాన రహదారిపై సభ నిర్వహణకు ఏర్పాట్లు జరుగుతున్న నేపథ్యంలో బుధవారం నుంచి నాలుగు చక్రాల వాహనాలను బైపాస్ రోడ్డు మీదుగా పంపించేలా పోలీసులు నిర్ణయించారు. ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా ఏపి ప్రాంతాల నుంచి వచ్చిన వాహనాలు ఎక్కడ పార్కింగ్ చేయాలో పోలీసులు మండల నాయకులకు ముందుగా సూచన చేశారు. ఇదిలా ఉండగా ఉత్తరాంధ్ర మంత్రులైన బొత్స సత్యనారాయణ, ధర్మాన ప్రసాదరావు, సీదిరి అప్పలరాజు, వైసిపి ఉత్తరాంధ్ర ఇన్‌ఛార్జ్ వైవి సుబ్బారెడ్డి హాజరు కానున్నారు.

సాధికార యాత్ర ఏర్పాట్లు పరిశీలన

ప్రజాశక్తి - సీతానగరం/పార్వతీపురం

నియోజకవర్గంలో ఈనెల 10న జరగనున్న సామాజిక సాధికార యాత్ర కార్యక్రమం ఏర్పాట్లను జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, పార్టీ పరిశీలకులు శోభా హైమావతి మంగళవారం పరిశీలించారు. మండలంలోని లచ్చయ్యపేట వద్ద ఏర్పాటు చేయనున్న మీడియా సమావేశం ప్రదేశం, కాశాయపేట వద్ద ప్రారంభానికి సిద్ధంగా ఉన్న సచివాలయం భవనాన్ని పరిశీలించారు. అనంతరం అక్కడి నుంచి నేరుగా పార్వతీపురం పాత బస్టాండ్ వద్ద సభావేదిక స్థలాన్ని పరిశీలించారు. ఆయన వెంట వైసిపి జిల్లా అధ్యక్షులు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు, టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ మంత్రి రవికుమార్, జెసిఎస్ కన్వీనర్లు జి.మాధవరావు, స్థానిక ప్రజా ప్రతినిధులు, కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజారక్షణభేరి సభకు తరలి రావాలి

ప్రజాశక్తి - పాచిపెంట

ప్రజారక్షణభేరి బస్సు యాత్ర ముగింపు సందర్భంగా ఈనెల 15న విజయవాడలో సిపిఎం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో జరుగుతున్న భారీ బహిరంగ సభ లో ప్రజలంతా పాల్గొని, జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎన్‌వై నాయుడు, మండల నాయకులు మంచాల శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. ఈ మేరకు బహిరంగసభ పోస్టర్‌ను మంగళవారం ఆవిష్కరించారు. ఈ బహిరంగ సభలో సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు, రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు ప్రసంగిస్తారన్నారు. కావున ఈ బహిరంగ సభకు ప్రజలంతా విచ్చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పి.శంకర్, ఎ.శ్రీను, పి.వసంతరావు, పి.లాజర్, విజయ్, నూకరాజు, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

మక్కువ: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 15న జరిగే ప్రజా రక్షణ భేరి బహిరంగ సభకు ప్రజలంతా తరలిరావాలని మండల సిపిఎం నాయకులు టి.ప్రభాకర్ కోరారు. ఈ మేరకు మక్కువలో బహిరంగ సభ పోస్టర్ విడుదల చేశారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గసభ్యులు వి.ఇందిర, నాయకులు భజంగరావు, కె.సుజాత, పార్వతి, తదితరులు పాల్గొన్నారు.

ఏడు ద్విచక్ర వాహనాలు పట్టివేత

ప్రజాశక్తి - సీతంపేట

ఇద్దరు వ్యక్తుల నుండి ఏడు ద్విచక్ర వాహనాలను పట్టుకొని సీజ్ చేసినట్లు పాలకొండ డిఎస్‌పి జివి కృష్ణారావు తెలిపారు. మంగళవారం సీతంపేట పోలీస్‌స్టేషన్లో విలేకరులతో మాట్లాడారు. పాలకొండ, వీరఘట్టం మండలాలకు చెందిన చిన్నారావు, మురళీకృష్ణ జల్సాలకు అలవాటు పడి సీతంపేట, కొత్తూరు, పాలకొండ, గజపతినగరం పోలీస్ స్టేషన్ పరిధిలో ఏడు ద్విచక్ర వాహనాలు దొంగలించడంతో వచ్చిన ఫిర్యాదుల మేరకు సీతంపేట ఎస్సై ఎ.నీలకంఠరావు సిబ్బందితో చాకచక్యంతో పట్టుకున్నట్లు తెలిపారు. అలాగే మద్యం సేవించి వాహనాలు నడపరాదన్నారు. అధికంగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని అందుకే డ్రింకింగ్ డ్రైవ్ తనిఖీలు చేపడుతున్నామని తెలిపారు. లైసెన్సు లేకుండా దీపావళి క్రయవిక్రయాలు జరగకూడదని తెలిపారు. డీఎస్పీతో పాటు సీతంపేట ఎస్సై ఉన్నారు.

బుడా నిధులతో అభివృద్ధి పనులు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

పట్టణంలోని చర్చి వీధిలో 40 అడుగుల సిసి రోడ్డు, కాలువలు అభివృద్ధి పనులకు బొబ్బిలి అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ సంస్థ ద్వారా రూ.50 లక్షలు మంజూరు కావడంతో మంగళవారం పనులు పరిశీలించారు. ఈ మేరకు బెలగాంలోని చర్చి వీధిలో మున్సిపల్ కమిషనర్ జె.రామఅప్పలనాయుడు, మున్సిపల్ ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్, రెవెన్యూ, ప్రజారోగ్య విభాగం అధికారులతో పాటు సంబంధిత వార్డు సచివాలయ యామినిటీ కార్యదర్శితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ బెలగాంలో ఉన్న చర్చి వీధికి రూ.50 లక్షలు బుడా నిధులు మంజూరయ్యాయని తెలిపారు. 40 అడుగుల వెడల్పుతో సిసి రోడ్డు, కాలువలు, రోడ్డుకు ఇరువైపులా మొక్కలు వేయడానికి గానూ ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్టు తెలిపారు. టెండర్ కూడా ఖరారైందని, త్వరలో పనులు ప్రారంభిస్తామని తెలిపారు.



తహశీల్దార్‌తో మాట్లాడుతున్న మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ

వాహనాలకు జిపిఎస్ తప్పనిసరి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ఈ ఏడాది ధాన్యం కొనుగోలు కేంద్రాల నుంచి ధాన్యం లోడు తీసుకువెళ్లే వాహనాలకు జిపిఎస్ తప్పనిసరిగా బిగించాలని పార్వతీపురం మన్యం జిల్లా మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ కోరారు. ఈ మేరకు స్థానిక తహశీల్దార్ జె.రాములమ్మతో సమావేశమయ్యారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ధాన్యం కొనుగోలు చేసి తీసుకువెళ్లే ప్రతి వాహనానికి జిపిఎస్ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. జిపిఎస్ ఖరీదు రూ.2500 వరకు ఉంటుందన్నారు. జిపిఎస్ ఏర్పాటు చేయనిచో ఆ వాహనాలకు చెల్లించే అద్దెలో రూ.3వేలు చొప్పున వసూలు చేస్తామని తెలిపారు.

చిన్న బగ్గలో జగనన్న ఆరోగ్య సురక్ష

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని చిన్నబగ్గలో జగనన్న ఆరోగ్య సురక్ష మంగళవారం నిర్వహించారు. 400 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. చుట్టుపక్క గ్రామాల నుంచి రోగులు తరలివచ్చారు. ఇఒపిఆర్‌డి కొండపల్లి సత్యం పర్యవేక్షించి రోగులకు ఎటువంటి సౌకర్యాలు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేసి రవాణా వాహనాల ద్వారా ఇళ్లకు రోగులను పంపించారు. మర్రిపాడు వైద్యాధికారి సాయిచరణ్ వైద్య పరీక్షలు నిర్వహిస్తూ రోగులకు అన్ని మందులు అందుబాటులో ఉన్నాయని, రోగుల వద్దకే వైద్యం అందుతుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ నీలయ్య, ఎంపిటిసి మంగయ్య, వైద్యాధికారులు శృతి, కార్యదర్శి శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.



రోగులకు వైద్యసేవలందిస్తున్న వైద్యులు

జాతీయ గౌరవ్ దివాస్ విజయవంతంగా నిర్వహించండి

ప్రజాశక్తి - పార్వతీపురం

కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను షెడ్యూల్ తెగల ప్రాంత ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఈనెల 15 నుంచి నిర్వహించనున్న జన్ జాతీయ గౌరవ్ దివాస్ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని కలెక్టర్ నిశాంత్ కుమార్ అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టర్ కార్యాలయం నుంచి మండల స్థాయి అధికారులతో గృహ నిర్మాణాలు, సంపూర్ణ పోషణ, ఓటరు పునశ్చరణ, ప్రాధాన్యత భవనాలు, గడప గడపకు మన ప్రభుత్వ పనులు, జల జీవన్ మిషన్, రీ సర్వే తదితర అంశాల ప్రగతిపై వీడియో కాన్ఫరెన్స్ మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జన్ జాతీయ గౌరవ్ దివాస్, హమారా సంకల్ప్ విక్షిత్ భారత్ కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ పథకాలు ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి యోజన, సురక్ష బీమా యోజన, పోషణ్ శక్తి నిర్మాణ్ అభియాన్, జన్ ధన్ యోజన, వేతి వృద్ధిరుకుల తదితర పథకాలపై రోజుకు రెండు పంచాయతీల్లో ప్రచార వాహనంతో వివిధ ప్రదర్శన ద్వారా ప్రజలకు అవగాహన కల్పించనున్నట్లు వివరించారు. రక్తహీనత లోపం అధిగమించేందుకు నిబద్ధతతో పనిచేయాలని సూచించారు. మాతా, శిశు మరణాలు అరికట్టేందుకు చిత్తశుద్ధితో పనిచేసి ప్రాణాలు కాపాడమన్న సంతృప్తి పొందాలన్నారు. జిల్లా అధికారులు దత్తత తీసుకున్న పాఠశాలల్లో మౌలిక వసతులు వినియోగించుకొని విద్యార్థులు ఏపి సబ్జెక్ట్లో వెనకబడి ఉన్నది గుర్తించి పిల్లలపై ప్రత్యేక శ్రద్ధతో ఉపాధ్యాయులను నియమించి తరగతులు నిర్వహిస్తే శత శాతం ఫలితాలు సాధించవచ్చని పేర్కొన్నారు. జిల్లాలో తక్కువ సమయంలో ఓటరు పునశ్చరణ కార్యక్రమం సమర్థవంతంగా నిర్వహణ పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. గృహ నిర్మాణాలకు నిధులు, సామాగ్రి సమస్య లేదని లక్ష్యం మేరకు పూర్తికి వేగవంతం చేయాలని స్పష్టం చేశారు. జలజీవన్ మిషన్ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ ఏర్పాటు చేసిన మంచినీటి కుళాయిలకు ట్యాప్ లను అమర్చాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. సమావేశంలో కలెక్టర్ ఆర్.గోవిందరావు, డిఆర్ఒ జె.వెంకటరావు, డిఎంహెచ్ఒ డాక్టర్ బగాది జగన్నాథరావు, డ్వామా, డిఆర్‌డిఎ, హౌసింగ్ పీడీలు కె.రామచంద్రరావు, పి.కిరణ్‌కుమార్, పి.రమేష్, జిల్లా వ్యవసాయ అధికారి కె.రాబర్ట్ పాల్, ఆర్‌డబ్ల్యుఎస్ జిల్లా అధికారి ఓ.ప్రభాకర రావు, జిల్లా గృహ నిర్మాణ సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ పి.రమేష్, డిపిఒ బలివాడ సత్యనారాయణ, డిఇఒ ఎన్.ప్రేమ్ కుమార్, సర్వే అండ్ సెటిల్మెంట్ అధికారి కె.రాజ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

2474 మందికి మెరుగైన వైద్యం కోసం సిఫార్సు

ప్రజాశక్తి - పార్వతీపురం

జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన ప్రత్యేక వైద్య శిబిరాల ద్వారా 2474 మందిని మెరుగైన వైద్యం కోసం రిఫరల్ చేసినట్టు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బగాది జగన్నాథరావు తెలిపారు. డిఎంహెచ్ఒ, జిల్లా ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్ డాక్టర్ కె.అప్పారావుతో కలిసి సిఫార్సు చేసిన కేసులపై మంగళవారం సమీక్షించారు. జిల్లాలో జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపుల ద్వారా 1,24,589 మంది వైద్య పరీక్షలు చేయించుకున్నారని, వారిలో 2,474 మందిని మెరుగైన వైద్య కోసం వివిధ ఆసుపత్రులకు రిఫరల్ చేసినట్లు చెప్పారు. రిఫరల్ చేయించుకున్న వారిని నవంబర్ 30లోగా ఆయా ఆసుపత్రులకు తీసుకెళ్లి మెరుగైన వైద్యమందించే బాధ్యతను సిహెచ్ఒలు, ఎఎన్ఎంలు తీసుకోవాలని స్పష్టం చేశారు. రిఫరల్ కోసం వచ్చే రోగులకు అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహించి రోగం నయం చేసి, తగ్గేంత వరకు ఉచితంగా మందులు అందించాలని అన్నారు. ఆరోగ్య మిత్రల సహకారంతో వెంటనే రిజిస్ట్రేషన్ ప్రక్రియ, తర్వాత చికిత్స అందించే పక్రియను త్వరితగతిన చేపట్టాలని అన్నారు. వచ్చే ఏడాది జనవరి 1 నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత కార్యక్రమం కూడా ప్రారంభమవుతుందని వివరించారు. రిఫరల్ పేషెంట్లకు వైద్యం అందించే ప్రక్రియలో ఎలాంటి జాప్యం లేకుండా చూడాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో జిల్లా మేనేజర్ రాంబాబు, ఆరోగ్యమిత్రలు, టీం లీడర్లు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

పథకాలపై అవగాహన కల్పించాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - గరుగుబిల్లి

రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై ప్రజలకు మరింత అవగాహన కల్పించాలని కురుపాం ఎమ్మెల్యే పి.పుష్పశ్రీవాణి అన్నారు. మంగళవారం స్థానిక పిఎసిఎస్ కార్యాలయ ఆవరణలో మంగళవారం గ్రామ సచివాలయాల కన్వీనర్లు, గృహసారధులు, సర్పంచులు, ఎంపీటీసీలు, వాలంటీర్లు, వైసిపి ముఖ్య నాయకులు, కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. ఇప్పటికే నియోజకవర్గం పరిధిలోని దాదాపు అన్ని గ్రామాల్లో గడపగడపకు మనప్రభుత్వం కార్యక్రమంలో ప్రజలను నేరుగా కలిసి ప్రభుత్వం తరపున అందిస్తున్న లబ్ధి గురించి చెప్పామని ప్రజా సమస్యలను సైతం పరిష్కరించినట్టు తెలిపారు. వైసిపి జిల్లా అధ్యక్షులు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించేందుకు ప్రతి గ్రామంలో ప్రచారం చేయాలని నాయకులు, కార్యకర్తలకు తెలియజేశారు. అదేవిధంగా గెలుపే లక్ష్యంగా శక్తి వంచన లేకుండా పని చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపిపి ఉరిటి రామారావు, జెడ్పీ వైస్ చైర్మన్ మరిశర్ల బాపూజీనాయుడు, సర్పంచులు కలిశెట్టి ఇందుమతి, గులిపల్లి నారాయణమ్మ, బొంతాడ మహేశ్వరరావు, ఎంపిటిసి సభ్యులు బొంగు గౌరమ్మ, వైసిపి నాయకులు రౌతు రామి నాయుడు, గొట్టాపు తేజేశ్వరరావు, బత్తల పకీరు నాయుడు, కేతిరెడ్డి అచ్యుతరావు, అక్కేన వెంకట నాయుడు, మూడడ్ల అప్పారావు, గులిపల్లి శ్రీనివాసనాయుడు, తదితరులు పాల్గొన్నారు.




ఆశాలకు సూచనలు చేస్తున్న డిఐఒ జగన్మోహనరావు

ఆశాలే కీలకం : డిఐఒ

ప్రజాశక్తి -వీరఘట్టం

ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరోగ్య కార్యక్రమాలు ప్రజలకు చేరువచేయడానికి ఆశా కార్యకర్తలే కీలకమని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి టి.జగన్మోహనరావు అన్నారు. ఈ మేరకు మంగళవారం వీరఘట్టం, బిటివాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో నిర్వహించిన ఆశా డే కార్యక్రమాన్ని సందర్శించి ఆశా కార్యకర్తలనుద్దేశించి ఆయన మాట్లాడారు. ప్రతి ఆరోగ్య కార్యక్రమాన్ని వైద్యాధికారులు, సిబ్బంది పక్కా ప్రణాళికతో నిర్వహించి ప్రజలకు పూర్తిస్థాయిలో వైద్య సేవలు అందజేయాలని సూచించారు. ఇందుకు ఆశా కార్యకర్తలు కీలకపాత్ర పోషించాలన్నారు. ఆశాలకు ఇవ్వబడిన హెచ్‌బిఎన్‌సి కిట్లను ఉపయోగించి వారి పరిధిలో ఉన్న నవజాత శిశువులను ఐదేళ్లలోపు పిల్లల ఆరోగ్యం పరిశీలించాలని, ముఖ్యంగా పిల్లల ఎదుగుదల, బరువు, శ్వాస ప్రక్రియ తదితర వివరాలు పరిశీలించి నమోదు చేయాలన్నారు. అలాగే పిల్లలకు వేస్తున్న ఐరన్ సిరప్ విటమిన్ ఏ ,టీకాలు ,వివరాలు షెడ్యూల్ ప్రకారం సందర్శించి నమోదు చేయాలన్నారు. గర్భిణీలను త్వరగా గుర్తించి రిజిస్ట్రేషన్ చేసి ఆరోగ్య తనిఖీలు పరీక్షలు చేయాలన్నారు. మొదటి కాన్పు ఆడ శిశువును జన్మించిన, రెండో కాన్పు౹ గర్భిణీలకు ప్రభుత్వం అందజేస్తున్న పిఎంఇవై పథకం అర్హులందరికీ చేరేలా చర్యలు చేపట్టాలని కార్యకర్తలు ఆదేశించారు. గర్భనిర్ధారణ పరీక్షల కిట్లు ఆశాల వద్ద అందుబాటులో ఉంచాలన్నారు. వైద్య ఆరోగ్యశాఖ ఆరోగ్య సలహాలు సూచించేందుకు ఇవ్వబడిన కిల్కరి మొబైల్ నెంబర్ గర్భిణీల వద్ద ఉండాలని, వాటిపై అవగాహన కల్పించాలని సూచించారు. హైరిస్కు గర్భిణీల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపి మాతా, శిశు మరణాల నివారణకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు జి.ప్రదీప్ కుమార్, పి.ఉమామహేశ్వరి, ఎ.మానస, ఎస్.నితీశా, సూపర్వైజర్లు జగన్నాథరావు, శాంతి కుమారి, కల్యాణి, శ్రీనివాసరావు, ఇందిరాదేవి, జయగౌడు, ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కళావతి

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

ప్రజాశక్తి - భామిని

ఎన్నికలు వరకే రాజకీయమని, ఎన్నికల అనంతరం రాజకీయాలకు అతీతంగా ప్రతి కుటుంబానికి అర్హత ప్రామాణికంగా సంక్షేమ ఫలాలు అందించిన ప్రభుత్వం వైసిపి అని, ఈ అంశం లబ్ధిదారులు మరిచిపోరాదని స్థానిక ఎమ్మెల్యే వి.కళావతి తెలిపారు. భామిని సచివాలయం పరిధిలో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటి వెళ్లి ఈ ప్రభుత్వం హయాంలో ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని, సకాలంలో రేషన్, పెన్షన్ అందుతుందా అనే అంశాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం అనారోగ్యంతో బాధపడుతున్న పెద్దదిమిలికి చెందిన సిద్దేశ్వర శ్రీశైలంకు సిఎం సహాయ నిధి నుండి మంజూరైన లక్ష రూపాయల చెక్కును ఆయన భార్య జ్యోతికి అందజేశారు. కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ తోట సింహాచలం, వైస్ ఎంపిపి బోనగడ్డి ధర్మారావు, ఆదివాసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు బిడ్డిక తేజేశ్వరరావు, జెసిఎస్ కో ఆర్డినేటర్ కొత్తకోట చంద్రశేఖర్, మండల వైసిపి నాయకులు రొక్కం రమేష్, బొమ్మాళి సంజీవరావు, పోతల మజ్జి, పోతల హరికృష్ణ, మామిడి కృష్ణ, పోతల చంద్రభూషణ, బొమ్మాళి బాలకృష్ణ, గేదెల మోహన్, కార్యకర్తలు పాల్గొన్నారు.

బూర్జిలో భవిష్యత్తు గ్యారంటీ

ప్రజాశక్తి -సీతానగరం

మండలంలోని బూర్జిలో మంగళవారం బాబు ష్యూర్టీ... భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా గ్రామంలో టిడిపి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన సభలో పార్వతీపురం నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి బోనెల విజయ్ చంద్ర మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రజలు సాగనంపే రోజులు దగ్గర పడ్డాయన్నారు. రాబోయే ఎన్నికల్లో భారీ మెజార్టీ ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్ష కార్యదర్శులు కె.తిరుపతిరావు, ఆర్.వేణుగోపాల్ నాయుడు, గొట్టాపు వెంకట నాయుడు, గ్రామ కమిటీ నాయకులు రెడ్డి అన్నంనాయుడు, కల్యాణ్, బలరాంతో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని కొండవాడ పంచాయతీ ఆలవడ్డలో బాబు షూరిటీ భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. కురుపాం నియోజకవర్గ టిడిపి ఇన్చార్జి తోయక జగదీశ్వరి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గ్రామ కమిటీ అధ్యక్షులు సురేష్, యూనిట్ ఇన్చార్జ్ చిన్న, గుమ్మలక్ష్మీపురం బూత్ ఇన్‌ఛార్జి రాజేష్, ఎల్విన్ పేట బూత్ ఇన్‌ఛార్జి బాల, తాడికొండ యూనిట్ ఇన్చార్జ్ నరేష్, వాడబ్బాయి గ్రామ కమిటీ అధ్యక్షులు కామేష్, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీతంపేట: మండలంలోని కుమ్మరగండిలో పాలకొండ నియోజకవర్గం ఇంచార్జ్ నిమ్మక జయకృష్ణ ఆధ్వర్యంలో ఇంటింటికి వెళ్లి బాబు షఉరిటీ -భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జయకృష్ణ మాట్లాడుతూ మినీ మేనిఫెస్టోలోని సూపర్ సిక్స్ అంశాలును వివరిస్తూ ఖచ్చితంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా మళ్లీ చంద్రబాబునాయుడు గారు రావాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. రాష్ట్ర పరిస్థితులను అధ్యయనం చేస్తున్న ఏకైక వ్యక్తి చంద్రబాబు నాయుడు గారేనని పేర్కొన్నారు. చంద్రబాబు గెలిపించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరి పైపా ఉందని అన్నారు. రాష్ట్రంలో పరిపాలన సక్రమార్గంలో ఉండాలంటే చంద్రబాబు ముఖ్యమంత్రిగా మళ్లీ రావాల్సిందేనని స్పష్టం చేశారు. ఇందులకు కార్యకర్తలు, నాయకులు శక్తివంచన లేకుండా కృషి చేయాలని కోరారు. కార్యక్రమం రాష్ట్ర ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు గొట్టిముక్కల కోటేశ్వరరావు,క్లస్టర్ ఇంచార్జ్ నిమ్మక చంద్రశేఖర్,శిల్లా గుప్తా,మాజీ సర్పంచ్ సవర నారాయణ రావు,సవర ఇశ్రాయేల్ సవర రజిని,సవర సంజయ్,సవర గంగరావు,మరియు గ్రామా పెద్దలు,మహిళలు కార్యకర్తలు పాల్గొన్నారు.



సీతానగరం : బూర్జిలో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న విజయచంద్ర

కురుపాం ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి -కురుపాం

స్థానిక ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గాన్ని సోమవారం సాయంత్రం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎన్నికున్నారు. ఎన్నిక రిటర్నింగ్ అధికారిగా మన్యం జిల్లా సహాయ కార్యదర్శి నెల్లి శ్రీనివాసరావు (విశాలాంధ్ర)సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులు కాదా చంద్ర మౌళి(సాక్షి), ప్రధాన కార్యదర్శిగా మోనంగి పృధ్వీరాజ్(99), ఆర్గనైజింగ్ కార్యదర్శి పిరిడి నాగరాజు(ప్రైమ్ 9), కోశాధికారి: జి.డిల్లీశ్వరరావు (ప్రజాశక్తి), ఉపాధ్యక్షులుగా ఆకుల మురళీకృష్ణ (ఆంధ్ర జ్యోతి), గొటారి మనోజ్ (సాక్షి టివి), పి.సంతోష్ (టీవీ5), సహాయ కార్యదర్శులుగా చిప్పాడ గోపి(జనదీపిక), డి.ప్రదీప్ (మహాన్యూస్), సువ్వాన సోమేశ్వర రావు(ఈనాడు), గౌరవ న్యాయ సలహాదారుగా బరాటం చంద్ర మౌళి (ఆంధ్ర జ్యోతి), గౌరవ సలహాదారుగా గొటారి వెంకటరావు(వార్త), ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా ఎస్.శ్రీనివాస్ (టివి 9), శేషు (హెచ్‌ఎంటివి), రామకృష్ణ (సూర్య), సురేష్ (ఐ.న్యూస్), ప్రసాద్(ఎబిఎన్), రాజు, అనిల్ (ఆర్.టీవీ) మద్ది సుధాకర్, గౌరీశంకర్ నారాయణను ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గానికి ప్రజాప్రతినిధులు, అధికారులు శుభాకాంక్షలు తెలిపారు.



ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి కి కృతజ్ఞతలు తెలుపుతున్న ప్రెస్‌క్లబ్ సభ్యులు

ఎమ్మెల్యేకి కృతజ్ఞతలు తెలిపిన ప్రెస్ క్లబ్ సభ్యులు

రాష్ట్ర కేబినెట్‌లో ఇటీవల ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అక్రిడేషన్ కలిగిన ప్రతి జర్నలిస్టుకు మూడు సెంట్లు భూమి ఇవ్వనున్నట్లు క్యాబినెట్లో ఆమోదం తెలిపినందుకు మంగళవారం స్థానిక ప్రెస్ క్లబ్ సభ్యులు కురుపాం ఎమ్మెల్యే పాముల పుష్ప శ్రీవాణికి చినమేరంగి తన అతిథిగృహంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమెకు దుస్సా శాలువా కప్పి, బొకెను అందజేశారు. కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ సభ్యులంతా పాల్గొన్నారు.

రోడ్ల నిర్మాణాలకు ప్రాధాన్యత : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ఏజెన్సీలో మారుమూల గ్రామాలకు రహదారుల నిర్మాణానికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు కురుపాం ఎమ్మెల్యే పాముల పుష్ప శ్రీవాణి అన్నారు. మండలంలోని తాడికొండ గ్రామం నుంచి ఒడ్రుబంగికి, తాడికొండ నుంచి దేరుగండకు రహదారుల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఎన్నో ఏళ్లుగా పై గ్రామాలకు రహదారి లేకపోవడంతో గిరిజనులు అనేక విధాలు కష్టాలు ఎదుర్కొంటున్నారని గుర్తించి జగనన్న ప్రభుత్వం రహదారులకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఆమె తెలిపారు. రహదారి నిర్మాణాలు పూర్తయితే అన్ని రకాల మౌలిక వసతులు గిరిజనులకు అందుబాటులోకి వస్తాయన్నారు. కార్యక్రమంలో ఎంపిపి కె.దీనమయ్య, జడ్పిటిసి రాధిక, తాడికొండ సర్పంచి జగ్గారావు, వైసిపి నాయకులు, కార్యకర్తలు, ఇంజనీరింగ్ అధికారులు ఉన్నారు.

ఆశ్రమ పాఠశాలలో సివి రామన్ జయంతి

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో నోబుల్ బహుమతి గ్రహీత, భారత రత్న సర్ సివి రామన్ జయంతోత్సవాలు ప్రధానోపాధ్యాయులు ఎ.లిల్లీరాణి ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆయన స్ఫూర్తితో విద్యార్థులు బాగా చదువుకోవాలన్నారు. అలాగే పాఠశాలలో అటల్ టింకరింగ్ ల్యాబ్ ఏర్పాటు చేశామని, దీన్ని విద్యార్థులు ఉపయోగించుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

చేప పిల్లలు పంపిణీ

ప్రజాశక్తి - భామిని

క్రమబద్ధంగా చేప పిల్లలకు ఫీడింగ్ ఇస్తూ, మత్స్య సాగు విధానాలు అవలంభించడం ద్వారా చేపల పెంపకంలో మంచి లాభలు ఆర్జించవచ్చునని మండల మత్స్య శాఖ సహాయకులు కె.ఆదినారాయణ తెలిపారు. మండలంలోని మనుమకొండ, పాలవలస, బిచ్చ మాణుగూడలో సీతంపేట ఐటిడిఎ ద్వారా ఉచితంగా అందజేసిన 40,000 చేప పిల్లలను మత్స్య సహాయకులు మంగళవారం పంపిణీ చేశారు. పంపిణి చేసిన చేప పిల్లలను మనుమకొండ సర్పంచ్ నిమ్మల కేశవ, బిచ్చ మానుగూడ సర్పంచ్ బిడ్డికి తమ్మారావు చెరువులో వదిలేరు.

దిశా యాప్ డౌన్లోడ్ చేసుకో... క్షేమంగా ఇంటికి చేరుకో

ప్రజాశక్తి - వీరఘట్టం

ప్రతి ఒక్కరూ దిశా యాప్ డౌన్లోడ్ చేసుకోవాలని ఎస్సై ఎం.వెంకటరమణ ప్రజలను కోరారు. మంగళవారం స్థానిక అంబేద్కర్ జంక్షన్ వద్ద దిశ యాప్ డౌన్‌లోడ్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. దిశా యాప్ వల్ల మహిళపై దాడులు తగ్గేయన్నారు. ప్రతి ఒక్కరూ వీటిపై అవగాహన పొంది దిశా యాప్‌ను డౌన్లోడ్ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎఎస్ఐ కృష్ణంనాయుడు, మహిళా పోలీసులు, సిబ్బంది ఉన్నారు.

నాటు సారా ధ్వంసం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

స్థానిక ఎల్విన్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో పట్టుబడ్డ 365 లీటర్ల నాటుసారాను పాలకొండ డిఎస్‌పి కృష్ణారావు ఆధ్వర్యంలో గుమ్మలక్ష్మీపురంలో పోలీసులు ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా డిఎస్‌పి మాట్లాడుతూ అక్రమంగా నాటు సారా తయారు చేసినా, అమ్మకాలు జరిపినా వారిపై చట్టపరంగా చర్యలు చేసుకుంటామని హెచ్చరించారు. నాటు సారా వల్ల తాగడం వల్ల ఎన్నో అనార్థాలు ఉన్నాయన్నారు. గ్రామాల్లో ఎవరైనా నాటుసారా వంటకాలు, అమ్మకాలు చేపడితే తమకు సమాచారం అందించాలని కోరారు. కార్యక్రమంలో ఎల్విన్‌పేట సిఐ సత్యనారాయణ, ఎస్ఐ షణ్ముఖరావు, సిబ్బంది ఉన్నారు.

పాఠశాల తనిఖీ

ప్రజాశక్తి - మక్కువ

స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలను తహశీల్దార్ ఎ.సూర్యనారాయణ మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు బోధిస్తున్న తీరును విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. చదువులో వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని ఈ సందర్భంగా ఉపాధ్యాయులకు సూచించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు వారంలో ఒకరోజు తనిఖీలు నిర్వహించి ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామన్నారు.

ప్రతి ఒక్కరికీ పని కల్పిస్తాం

ప్రజాశక్తి - వీరఘట్టం

పని అడిగిన ప్రతి ఒక్కరికీ ఉపాధి ద్వారా పని కల్పిస్తామని పాలకొండ ఎఎంసి ఉపాధ్యక్షులు పొట్నూరు లక్ష్మణరావు గ్రామస్తులకు సూచించారు. మండలంలోని తెట్టంగిలో గ్రామస్తులతో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. వలసలు నివారించేందుకు వీలుగా గ్రామాల్లోనే పనులు కల్పించేందుకు అన్ని విధాలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఎవరికైనా జాబ్‌కార్డు లేకపోతే తక్షణమే దరఖాస్తు చేసుకొని జాబ్ కార్డు పొందాలన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి గ్రామంలో 41 రకాల పనులకు సంబంధించి రూ.96లక్షలతో పనులు కల్పించనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్ర మంలో సర్పంచ్ విజయమ్మ- ఏలియా, ఎంపిటిసి ఎస్ వరహాలమ్మ -సత్యం నాయుడు, ఎపిఒ జి.సత్యంనాయుడు, టెక్నికల్, ఫీల్డ్ సహాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.